అప్పుడప్పుడు నాక్కూడా యీ డాం రొటీను నుంచి ఎక్కడికైనా ఎగిరిపోవాలనుంటుంది. మావారు "అపొలో ట్వెల్వు"లో ప్రయాణం పెట్టుకున్నట్లు డాం బిజీగా వుంటారు. నాకేవీ తోచనపుడు సాహసాలు చెయ్యాలనిపిస్తుంది. కొత్త కొత్త లోకాలను అవలోకించాలనిపిస్తుంది. అప్పుడు నేను నడువెక్కి కూర్చున్న నవారుమంచవే నా అంతరిక్షనౌక. నా బుర్రలో చాలా స్క్రూలున్నాయి. అవి కొన్ని లూజ్‌చేస్తే అంటే మనసుని అలా గాలికి వదిలేస్తే (చంద్రమండలంలో గాలికూడా లేదట. గాలి పోగుచేసి అక్కడికి పంపించే బిజినెస్ ఒహటి పెట్టమని గవర్మెంటాఫిండియాకో, అమెరికాకో లెటర్ ఒహటి రాయాలి) నోటికి వేరుశెనక్కాయలో, జీళ్ళో, తేగలో అందిస్తే.... నా మైండ్ ఏయే లోకాలకు వెళ్తుందో నే నిప్పుడు చెప్పలేను. మనోజవం మారుత తుల్యవేగం అన్నారు కదా - మైండుతో సందర్శించలేనిదంటూ వుండదు. మైండుండబట్టేగదా మేటరూ - వుండండి సార్! జస్టెమినిట్... మన దేహాల్ని కూడా అంతరిక్షనౌకలనవచ్చుకదా - అవేకదా మనల్ని ఎప్పుడో ఒహప్పుడు అంతరిక్షానికి అంటే కైలాసవో, వైకుంఠవో తీసికెళ్ళేది. సంసారమనే ఈ అశాంతి సాగరంలోపడి కొట్టుకొంటున్న ఈ దేహాన్ని విడిచి జీవుడు అంతరిక్షంలోకి వెళ్ళడం సెంట్ పరసెంట్ ఖాయంగనుక. అంతరిక్ష నౌక మనం ఎక్కలేదే అని ఎవరూ విచారించకండి.

కాని ఒక చిన్న కిటుకుంది.

మన అంతరిక్షనౌక మళ్ళీ భూమ్మీదకు తిరిగిరాదు. మన తర్వాత పడవ ఎక్కేవాళ్ళు మన్ని ఏట్లోకో కాట్లోకో తోస్తారు. అంతే. టేకిట్ ఈజీ!

# ప్రేమకి మీసాలు

"కలకలలాడు వాలుజడకై
జగమెంత తపస్సొనర్చెనో"

అంటాడు కవి. అప్పుడప్పుడు జడ "చెలియ భుజానవ్రాలి కుచసీమ నటించుచు" ముందుకు వచ్చినా పాపం మళ్ళీ వెనక్కు విసురుగా వెళ్ళి "కటిసీమ"ను నడయాడకతప్పదుకదా! ప్చ్! స్త్రీ సౌందర్య సుకుమార వయోవిలాస విభ్రమాదులకు ఆమె వయ్యారాల వాల్జడే సాక్షి. కాని ఈ జడ ఇలా పాపం వెనక్కే ఎందుకు వుండిపోయిందీ అని అస్మదాదులకో అనుమానం!

ఇంత డేంజరస్ ఇన్‌స్ట్రుమెంటు కదా ఈ వయ్యారాల వాల్జడ, దీన్ని అస్తమానూ వయో విలాసినులు ఉపయోగించకుండా కొంచెం వెనక్కే అసింటా అట్టేపెట్టడం ఒకవిధంగా దూరదృష్టితో ఆలోచించి చేసిన పనిలా తోస్తుంది. కళ్ళకు కట్టే కమనీయ సౌందర్యవంతా ముందుంచి దీన్ని కాస్త వెనక్కు నెట్టెయ్యడంలో సృష్టికర్త తెలివైన పనే చేశాడు. ఆడవాళ్ళు

ముందుకడుగువేసినప్పుడల్లా వారిని జడపుచ్చుకుని లాగొచ్చు. ఇంజన్‌కి బ్రేకు అవసరంకదా. జడవంటి ప్రమాదకరమైన ఆయుధాన్ని ఆడవాళ్ళకిచ్చి అది వెనక వయ్యారంగా వ్రేలాడుతూ వుండేలా చేసిన ఏర్పాటులో చిన్న కుట్రవుంది. దీన్తాలూకు రాజకీయం ఏవిటంటే "నిలు నిలు బాలా" అంటూ జడ అందుకుని ఆపుచేస్తే రెండు చేతుల్తో ఎడాపెడా వాయించగలదు ఆ సుందరి (అది ఆమె ఇష్టం) లేక ఆమె వచ్చి జాక్‌పాట్‌లా వళ్ళో వాలనూగలదు. చిన్నకారులాటి సన్నకారు సుందరికైనా సడన్ బ్రేకులవసరం. దీన్ని ఛాందసులు "వలపుల ఉరిత్రాడు" అన్నారు.

దీన్ని మెడచుట్టూ తిప్పుకుని వలపుల గిలక ప్రతీదీ "తెస్తావా – ఛస్తావా" అని మారాం చెయ్యొచ్చు. అంతమాత్రాన ఎవరూ చావరనుకోండి. కాని చచ్చినంతపని అవుతుంది. "హేండ్సమ్ ఈజ్ దట్ హేండ్సమ్ డజ్" అన్నాడుకాని పూర్ గోల్డుస్మిత్ అందమైన వస్తువులన్నీ అందమైన పన్లు చెయ్యవు. త్రాచుపాము ఎంత బ్యూటిఫుల్‌గా వుంటేమటుకు సుఖమేవిటి? టక్కుమని కాటేస్తుందికదా! పులి మీసాల్తో ఆడుకోలేముకదా! అలాగ అందమైన ఆడాళ్ళు అన్నందాలా పనికిరారు. వాళ్ళవి చాలా కుళ్ళుబోతుమనసులు కావచ్చు. చర్మం తెలుపేగాని మనస్సు కారునలుపు కావచ్చు. కళ్ళు విశాలనేత్రాలేకాని ఎదటివారిని చూసి ఓర్వలేకపోవచ్చు. పైకి నవ్వేది చిరునవ్వేకాని అది కొంపలీయచ్చు. కట్టింది జల్తారంచు ఖరీదైన కోకేకాని లోపల చవకబారు కోరికలుండవచ్చు... ఒత్తైన నల్లని నిగనిగలాడే జుట్టుకల ఆడదానికి అంత ఒత్తు లోపల మంచి ఆలోచన్లు వుండటానికి బుర్రలో ఖాళీలేకపోవచ్చు.

ఇంత చక్కని జడను ముద్దుగా పిల్చుకోటానికి ఇంగ్లీషువారికి పిగ్‌టైల్ కంటె మంచి మాటదొరకనేలేదా? పందికి తోకవంటిదని తాత్పర్యంకదా – గుర్రంకుచ్చులాటి జడ అని ఫాషనుందనుకోండి. ఐతే కొందరాడవాళ్ళు ఈ పిగ్‌టైల్ పిగ్‌కు వర్తిస్తుంది మాకు కాదని చమత్కరించవచ్చు. పిలకున్నవారినైనా జటాధారులనైనా 'పిగ్' అనటం ఏమంత బాగోలేదు. పరమబ్యాడ్ టేస్ట్‌కి నిదర్శనం.

మరి ఈ పిగ్ టైల్‌మీద అలిగో కోపంవచ్చో కొందరు సుందరాంగులు చక్కా వేణీ సంహారం చేస్తున్నారు. క్కాదుకాదు. చేయించుకుంటున్నారు. తమాషాకో, కులాసాకో, ఖుషీకో.

వేణీ సంహారం అట్టే మంచిపద్ధతి కాదు. జడ లేకుండా జుత్తు బుజాలమీద విరబోసుకుని అమ్మశక్తిలా తిరిగేవారికి ముందు జాగ్రత్త ముందు చూపేకాని వెనుకచూపు లేదంటారు. కవితకు మెప్పు, వనితకు కొప్పు అన్నారా లేదా? పడకటింట్లో వలపులు చిలుకుతూ కులికే వన్నెల విసనకర్రను అందుకోడానికి వాల్జడైనా దొరక్కపోతే ఆ కథానాయకుడేం కావాలి? ఆడదానికి వాణీ సౌభాగ్యం కంటె కూడా వేణీ సౌభాగ్యమే మిన్న. శృంగారవీథిలో బాబ్‌డ్ హైర్ కత్తెకు దేవిడీ మన్నాయే. చిన్నపిల్లలకి ఓ వయసులోని వారికది ముచ్చటే కాని, జడసొగసు జడ సొగసే... పువ్వులతోటలో నవ్వుల భరిణెలా గుండవలసిన ఆడదాని సొగసు చేతి కందని ముళ్ళకంపవతు ఐతే ఎలాగెలాగ?

ఆడదానికి జడ ఎంత సొగసో మగవారికి మూతికి మీసం కూడా అంతే – తుమ్మెదరెక్కల్లాటి మీసాలు బుగ్గలకు తగిల్తే కితకితలుపెట్టి నవ్విస్తాయి. మరీ కృష్ణదేవరాయల్లాటి మీసాలక్కర్లేదు గాని మూతికి ఓ మోస్తరు మీసంకూడా అందవే.... మీసాల్లేకపోతే తుచ్ఛసుఖములన్నీ మీసాలపై తేనియల్ అని ఎలా తెలుస్తుంది? మీసాలు లేనివాళ్ళకి (ఆడవాళ్ళకు కొందరు మగవాళ్ళకు పిల్లలకు) తుచ్ఛ సుఖములు మీసాలపై తేనియల్ కావా? ఏవిటో పెద్దనగారుకూడా ఇలా అవకతవకగా రాస్తారు?

స్త్రీ పురుషులమధ్య ప్రేమకలగటానికి మీసాలు దోహదకారులా. కావా అను విషయంపై హనుమాయమ్మ "ప్రేమకి మీసాలు" అని నవల రాసింది. ఆవిడ ఇదివరలో సీరియల్‌గా రాసిన "వలపులగిలక" చదివిన పాఠకులు "ప్రేమకి మీసాలు" లాటి నవల ఛస్తే మళ్ళీ మీరు రాయలేరని ఆవిడతో పందెం కాశారట. "ప్రేమకి మీసాలు" సీరియల్‌లో కథానాయకుడు మీసాల్నెక్కువగా ప్రేమిస్తున్నట్లు కథనాయికను తక్కువగా ప్రేమిస్తున్నట్లు హీరోయిన్‌కి అనుమానం కలుగుతుంది. వెంటనే ఆవిడ ఆ మీసాల్ని తీసేయమంటుంది. మీసాల్ను అంతగా ప్రేమించిన ఆ హీరో తన మీసాల్ను తీసేస్తాడా. రబ్బరుబంతిలాగ, గులాబ్‌జామ్ లాగ, తొక్కుడులడ్డూలాటి ప్రేయసి ప్రేమను వదులుకుంటాడా? అబ్బ చెడ్డ సస్పెన్స్... "ప్రేమకి మీసాలు" నవల మీరు చదవలేదా? చదవకపోతే మీ జన్మ జన్మంతా వేస్టే....

# "కాఫీ" యుద్ధాలు

"**కా**ఫీ యుద్ధాలని" జరిగేవి మా ఇంట్లో – చద్దెన్నాలను తెచ్చి కాఫీకి పోటీ పెట్టేవారు. కొంపలోకి కాఫీని ప్రవేశ పెట్టడం అంటే అంటు వ్యాధినో మహమ్మారినో ప్రవేశపెట్టినట్లు. కొంప గుండవై పోతుందని పెద్దవాళ్ళు లబలబలాడి పోయేవారు. ఇంగ్లీషు చదువులూ, క్రాఫింగులూ ముందూ, కాఫీలు కొంచెం వెనుకా కొంపల్లో ప్రవేశించాయి. అశుభ ప్రాప్తమ్మగు కలియుగంబు కాఫీతో పాదమ్మిడియెన్ అని మా వాళ్ళంతా నమ్ముతూండేవారు. ఇప్పుడు సోషలిజాన్ని ప్రవేశ పెడతామని కాంగ్రెస్ వారు సరదాకి నోరు జారగానే ముసలి పులులు కంగారు పడినట్లుగా, బ్యాంకులను జాతీయం చేయటం సమస్య కంటె చిక్కు సమస్య అయిపోయింది కాఫీ ప్రవేశం ఆరోజుల్లో.

మాకు కొంత మంది ఇంగ్లీషు చుట్టాలు వచ్చినప్పుడల్లా ఎవరి కాఫీపొడి వారే తెచ్చుకునేవారు. కాని అప్పుడప్పుడు బిళ్ళల కాఫీ త్రాగాలిసొచ్చినప్పటికీ కాపీ వాదులకూ నాన్ కాఫీ వాదులకూ ఎక్కడా సయోధ్య కుదిరేదికాదు. మా వాళ్ళు కాఫీ కుంపటి అని ఓ కుంపటిని యివతల తగలేసేవారు. ఆ కాఫీ వడపోసిన గుడ్డ వాసనకే మురిసిపోయిన పనిమనిషి